22102023-MAI-06_Layout 1 10/22/2023 3:30 AM Page 1





# తీరొక్క పూల జాతర

నీలాకాశాన్ని సిబ్బిగా మలిచి సింగిడిని పూల వరుసలుగా పేర్చి ప్రకృతినే దేవతగా పూజించే పండుగ బతుకమ్మ. ప్రపంచంలోనే అరుదైన రంగురంగుల పూలపండుగ. బతుకమ్మ అంటే బతుకుదెరువును మెరుగుపరిచే అమ్మ అని. ప్రకృతి నుంచి సేకరించిన పూలను తిరిగి ప్రకృతికే సమర్పించటం బతుకమ్మ పండుగ విశిష్టత. తొమ్మిది రోజుల పాటు తెలంగాణ అంతటా ఒక జాతరలా సాగి చివరిరోజు సద్దుల బతుకమ్మగా మన వాకిట్లో బతుకుదెరువును ఆవిష్కరిస్తుంది. ఆటపాటలతో మనల్ని సేదతీరుస్తుంది. జీవన సంబురాన్ని ఆవిష్కరిస్తుంది. ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా తెలంగాణలో మాత్రమే జరుపుకొనే పండుగ బతుకమ్మ. స్వరాష్ట్రంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొంది నేడు ప్రపంచంలో తెలంగాణవారున్న చోటల్లా పూలజాతరై వర్ధిల్లుతున్నది.

## బతుకమ్మ !

పూవులు నీ స్వరూపములు పూజలు సైతము పూలతోడనే
పూవులు జీవితమ్ములకు మూలములై వెలుగొందు నిత్యమున్
పూవుల మేరుచక్రమున పూజలనందెదవీవు రాజ్ఞివై
పూవుల తల్లి! మమ్మెపుడు బ్రోవుము నీ కరుణైక దృష్టితో!

నిన్ను బతుకమ్మ యందురు నిఖిల జనులు
నిన్ను సుమరాశి రూపున సన్నుతించి
చద్దులను నివేదన జేసి సంతసమున
సకల శుభములనందులే జగతి నేడు!



డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ
94404 68557

## బంగారు బతుకమ్మ

మహాలయ అమావాస్య నాడు
పూదోటల పున్నమల్లే వచ్చి
తెలంగాణ గడప గడపకు
వెలుగుల తోరణం కట్టి
పడతులను పరవశింపజేసి
పలకరించే పూలరెమ్మ బతుకమ్మ

పుట్టింటికి పయనమైన పుత్తడి బొమ్మ
గాజుల గలగలలు పసిడి పలుకులు
ఆప్యాయతలు అరవిరియగ
పట్నాలే పల్లెలకు కదిలివచ్చి
అంబరాన్నంటే సంబురాలను తెచ్చి
సద్దుల బతుకమ్మగా సందడి చేసి
గునుగు పూలు మురిపెంగా హారతులివ్వగ
గుమ్మడి పూలు, తంగేడులు తలంబ్రాలు పోయగ
చెరువులన్నీ పూల రహదారులై నిను సాగనంపే



కళ తాటికొండ
99898 91558



## పూల సింగిడి

తీరొక్క పూలన్ని తోడవ్వగా
తీయందనాలతో అలరారుతూ
ఘనముగ గౌరమ్మ కొలువుదీరగా
పులకించె తెలంగాణ మది మురవగా

ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ
ఆడపడుచులంతా ఆడిపాడగా
పువ్వు పువ్వున పులకింత విరిసేను
పూలసింగిడై నేలమ్మ మురిసేను

పిల్లాజెల్లాలంతా పాలపుంతై మెరువగా
లోగిల్లన్ని ఆనందాల హరివిల్లయి విరియగా
బతుకమ్మ పాటలే బడుగుల బతుకుల్లో
బుగులు తీర్చే భరోసా గీతాలయ్యి మోగెను

తంగేడు పూలు పసుపు ధనమవ్వగా
సీతమ్మ జడలు సింగారాలె అవ్వగా
అల్లీ లిల్లీ పూలు అల్లారు ముద్దులయ్యేను
గోరంటలు కొండంత అండయ్యేను

బంతిపూలన్నీ బలగమై చేరగా
చేమంతులన్నీ శ్రీమంతులవ్వగా
గునుగుపూలతో కలిసి గుబాళించేను
గౌరమ్మతో కలిసి గంగమ్మను చేరేను



అడప రాజు
91778 25265

## ఈ నేలమీద చంద్రవంక

ఇన్నాళ్లు
పూలు దేవుళ్లను అలంకరిస్తే ఇప్పుడు
దేవతలే పూలను అలంకరిస్తున్నాయి
ఎక్కడా లేని పండుగ ఈ నేల మీదనే చంద్రవంక

నవరాత్రులు నవరాగాలు అలలై పొంగే అనురాగాలు
ఆత్మీయ అనుబంధాలు మట్టిచేతుల బొడ్డెమ్మలు
వరుస వరుస అమరుల త్యాగాలెత్తి పాడుతూ
మంజీర నాదాలై దుందుభి దరువులై
వెండివానలా పూలవానలు
చిరునవ్వుల చిన్నారి బతుకమ్మలు
కోరిన కోరికలు తీర్చే తల్లి బతుకునిలిపే తల్లి
ఇంటి దీపమై వెలిగే తల్లి కంటి వెలుగై కాపాడే తల్లి
చల్ల చల్లగా దీవించే తల్లి సద్దుల బతుకమ్మ తల్లి
పాల వెన్నెలలా పసిడి గౌరమ్మ

పూల సమ్మేళనం విరబూసిన వెన్నెల సమ్మేళనం
పండు మీది రామచిలుకలా
తీరొక్క పువ్వుల బాలనాగమ్మలు
ఊరూరు గుండెలుప్పొంగే
నింగి నేల పులకరించే బతుకమ్మ సంబురం

ఓ బతుకమ్మ తల్లి
నా పాలవెల్లి కల్పవల్లి
సిరులు కురిపించె తల్లి
తల్లివి నీవే తండ్రివి నీవే
తెలంగాణ తల్లివి నీవే!



వనపట్ల సుబ్బయ్య
9492765358



## గడ్డి పూల గౌరమ్మ!

కాలం
ఎప్పుడూ ఒకేలా ఉండదు
గడ్డి పూలూ గౌరమ్మలవుతాయి!

పూల పండగొస్తే చాలు
పుట్టినిండ్లన్నీ
ఆడ బిడ్డలతోన కొలువుదీరుతాయి!

ఆట విడుపన్నట్టు
అడవి పూలన్నీ పల్లెల్నీ పట్టణాలనీ
పూల తేరులను చేస్తాయి!

తలమీదెక్కిన బతుకమ్మ
పసుపు కుంకుమలిచ్చి
చల్లగా ఉండమని దీవిస్తది!

మన చేత ఆడించి పాడించి
ఇంటిల్లి పాదిని ఆనందాల్లో ముంచి
గంగమ్మ సిగలోన తారకై తరలి పోతది!!



కోట్ల వెంకటేశ్వర రెడ్డి
94402 33261



## అడవి పూలకు స్వాగతం

కొండల్లో కోనల్లో ఎండల్లో వానల్లో
మంచు బిందువుల ముత్యాల్లో
సుందరంగా వికసించిన
బంగారు రంగు తంగేడు పూలకు
బూరు బూరు గునుగు పూలకు
స్వాగతం! సుస్వాగతం

పేర్చిన బతుకమ్మ గోపురములో
ఎన్నెన్ని పూలున్నా
వనం పూలే అందం చందం!
బొడ్డెమ్మ గుట్టలో
తంగేడు పూలు గునుగుపూలు
కనబడితేనే పండగ సార్థకం!

షోకుల్లేకుంటేనేం! అడవి పూలైతేనేం
తంగేడు గునుగు పూలకే రాణి కళ
రాచ మర్యాద!
స్వాగతం! సుస్వాగతం!!
అడవి పూలకు స్వాగతం!!

కందాళై రాఘవాచార్య
87905 93638

## తంగేడుపూల మహత్యం

పొక్కిలైన వాకిళ్లల్లా
కోటి వెలుగుల వెన్నెల అయితది
కూటికి లేని బతుకుల్లా
ఆత్మగౌరవ నినాదమైతది!!!

పల్లె పల్లెలో పండుగైతది
దండిగా పువ్వుల జాతరైతది
ఎండిన డొక్కల ఎతలను
అలసిన బతుకుల కథలను
రాగమెత్తి నినాదమై వినిపిస్తది!!!

పువ్వులను పూజించే సంస్కృతిని నేర్పుతది
పల్లెలను పసుపు వర్ణం చేస్తది
తల్లి లెక్క చెల్లి లెక్క ఆత్మీయ బంధం
తల్లిపేగు బంధమది
తంగేడు పూల మహత్యమది



దేవులపల్లి రమేశ్
9963701294

## కోటి గొంతుల బావుటా

బతుకమ్మ అంటే..
బతుకును నేర్పిన ఉద్యమం
నాడు నీళ్లులేని తెలంగాణలో
క'న్నీటి' చెలిమె బతుకమ్మ
కాయకష్టంలో
ఆత్మీయ చెలిమి బతుకమ్మ
పని పాటల జమిలి
బతుకు పాటల బలిమి
చైతన్యపు కలిమి బతుకమ్మ

బతుకమ్మ అంటే..
తనను తాను తవ్వి పోసుకున్న పాట
తనకు తానై ఉవ్వెత్తున ఎగసిన పాట
తనువెల్ల పల్లవించిన పాట
ఒక తలపోత.. ఒక వలపోత

విజయగాథల పూల పోత
పరిపరివిధాలా పరివ్యాప్తమైన
పల్లె పాట పడతుల ఆట
బతుకుపోరును పరిచిన
సామూహిక జీవన బాట

కోలాటాల సవ్వడిలో
సమైక్య సాధనా గీతిక
సమష్టి భావనాపతాక
తెలంగాణ అస్తిత్వ ప్రతీక
ప్రకృతి ఒడిలో పూదోట
ఆడపడుచుల సయ్యాట
కోటి గొంతుల బావుటా బతుకమ్మ..!



కటుకోజ్వల రమేష్
99490 83327

## బతుకునిచ్చే బతుకమ్మ

ఊర సెరువులన్నీ నిండుకుండలైనయి
వాగులన్నీ పుడమితల్లిని ముద్దాడుతున్నయి
ఆకుపచ్చని సీరె ఆరేసినట్టు
తెలంగాణ మాగాణమంతా
పసిడి పంటల పండుగ
కనులారా కాంచడానికి బయలెల్లింది
మాకు బతుకునిచ్చే బతుకమ్మ

తంగేడు పూలై పూస్తారు అక్కాచెల్లెళ్లు
బంధాలను పెనవేస్తారు తోబుట్టువులు
ఇల్లంతా ఆనందాల జాతరలు
పిల్లలంతా కేరింతల ఆటలు
ఊరంతా పూల పండుగలు
పూలసెట్టుకు పూసిన పువ్వులోలే
అందమైన అనుబంధాల నెలవులు

నిండుగా నిండిన సెరువుల్లో
పాలపిట్ట తానమాడుతుంది
సుక్కలు ముగ్గులై ఇంటిముంగట
అందమైన రంగవల్లికలైతున్నయి
ప్రకృతి వెన్నెలై ప్రేమవర్షం కురిపిస్తుంది
పూలన్నీ బతుకమ్మ సిగలోదూరి
పూలదేవతలై పోవాలని పరితపిస్తయి
తెలంగాణ నేలంతా పూలవనమైతది



అశోక్ గోనె
9441317361



## రాసగుమ్మడి పూవు ఉయ్యాలో

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో- బంగారు బతుకమ్మ ఉయ్యాలో!!
పూలకొమ్మలు పిలువ ఉయ్యాలో- చెలి చేయి చిలుకమ్మ ఉయ్యాలో!!
గుమ్మడాకుల తీగె ఉయ్యాలో- మమ్ము తెంపనె పడుచు ఉయ్యాలో!!
పచ్చని చందమామ ఉయ్యాలో- పరచినా తపుకమ్మ ఉయ్యాలో!!

పెట్టేనమ్మ తంగెడు ఉయ్యాలో- పెయ్యి నిండుగ నగలుయ్యాలో!!
దారిలో అడుగడుగు ఉయ్యాలో- దొరసాని కులుకమ్మ ఉయ్యాలో!!
గునుగు పూలను సూడు ఉయ్యాలో- గుసగుసలు చెవిలోన ఉయ్యాలో!!
కొసలంట మావదినె ఉయ్యాలో- వశపడని వణుకమ్మ ఉయ్యాలో!!

గన్నేరు పూవొకటి ఉయ్యాలో- కన్నెర్రజేసెనే ఉయ్యాలో!!
కని తెంపవేమంటు ఉయ్యాలో- కటువుగా పలుకమ్మ ఉయ్యాలో!!
రాసగుమ్మడి పూవు ఉయ్యాలో- రాణోలె కూసుంది ఉయ్యాలో!!
శిఖరాన మెరిసెనూ ఉయ్యాలో- శ్రీగౌరి తళుకమ్మ ఉయ్యాలో!!



మడిపల్లి రాజ్‌కుమార్
99496 99215

# శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మా..

బతుకమ్మ తెలంగాణ పండుగ, పల్లెల పండుగ, తీరొక్కపూల పండుగ, చెఱువుల పండుగ, పడతుల పండుగ, పర్యావరణ పండుగ. దేశీ సాంప్రదాయంలో గ్రామీణులు తరతరాలుగా తలమీద మోసుకొస్తున్న పండుగ. దేశి వ్యవహారంలో పామరులు పదాలు పాడుతూ, పాదం కదుపుతూ ఊరు ఊరంతా సంఘటితంగా చేసుకునే పండుగ. శిష్ట వ్యవహారాల లోని దేవుళ్ళకు దీటుగా, ఆదిగా, అనాదిగా ఒక గట్టి నమ్మకంతో ప్రకృతికి నిలువెత్తు నిదర్శనంగా పూజ్య భావంతో చేసుకునే కృతజ్ఞతా పూర్వక పూలపండుగ. పువ్వులై పువ్వులకు పూజలు చేసే పడతుల నిలువెత్తు సంబురాల పండుగ.



అయినంపూడి శ్రీలక్ష్మి
99899 28562

చరిత్రను తిరగేస్తే రాజ్యవ్యవస్థ ఏర్పడక ముందునుండే బతుకమ్మ పూజలున్నాయని, కొత్త రాతియుగం నాటికే ఆ పాటల, ఆటల ఆనవాళ్ళు కనిపించాయని చరిత్రకారులు చెప్తున్నారు. వాడపల్లి శాసనం ద్వారా 800 ఏండ్లకు ముందే బతుకమ్మ ఉందని సాధికారికంగా మనకు నిరూపణ అయ్యింది. అక్షరం ముక్క రాని ఆ కాలంలో చిన్నప్పటి నుంచే చిన్న పిల్లలకు ఆరోగ్య ఆహారం గురించి, పెండ్లి గురించి, వంటల గురించి, బిడ్డల శిక్షణ గురించి, అత్తింట్లో మసులుకోవలసిన తీరు గురించి, ఆడపిల్లల అలంకరణలో తీసుకోవాల్సిన అంశాల గురించి బొడ్డెమ్మపాటల రూపంలో ఎన్నో విషయాలు చెప్తూ వచ్చేవారని చరిత్రకారులు విశదపరిచారు.

'మా పాడిపంటలు సల్లంగ జూడ రావు రావా గౌరమ్మ మా ఇంటికి, మా పిల్లపాపల్లు సల్లంగ జూడ రావు రావా గౌరమ్మ మా ఇంటికి' అని సాగుతుందీ పాట. బతుకమ్మ పాటల్లో ఒక రిథమ్ ఉంటుంది. సాహిత్య పరంగా మాత్రా ఛందస్సులో ఉంటాయని పిస్తుంది. ఇవి ద్విపద కవితకు దగ్గరగా ఉంటాయని లాక్షణికులంటున్నారు. నాలుగేసి మాత్రలతో సాగితే చతురస్ర గతిగా, ఐదు మాత్రలతో సాగే ఆవృతాన్ని ఖండ గతిగా, ఏడు మాత్రలతో మిశ్రగతిగా భావిస్తుంటారు. సిద్ధేశ్వరి చరిత్రలో ఉన్న 14వ శతాబ్దం నాటి ధర్మాంగద రాజు పాటని ఇప్పటికీ మనం పాడుకుంటున్నాం. దశాబ్దంపాటు పాలించిన చాళుక్యులు తాము సప్తమాత్రుకల పుత్రులమని, హారతీదేవి పుత్రులమని సగౌరవంగా



చాటుకున్నారు. బతుకమ్మ నిమజ్జనాలకోసం వాడపల్లి రేవుని కాకతీయులు కట్టించారని, త్రికూటాలయాన్ని నిర్మించారని చారిత్రక ఆధారాలున్నాయి. నర్సింహకవి రాసిన 'శ్రీలక్ష్మి నీ మహిమలు గౌరమ్మ చిత్రమై తోచునమ్మా'' పాట వినపడని వాడకట్టు అంటూ తెలంగాణలో లేదు. వేమగంటి నర్సింహాచార్యులు పిల్లల్లో దేశభక్తిని పెంచటానికి బతుకమ్మ పాటల శైలిలోనే దేశభక్తి గీతాలు రాశారు. విశ్వనాథ సత్యనారాయణ కిన్నెరసాని పాటలకు బతుకమ్మ పాటలే మాతృక అంటారు. సాకేతపురి కస్తూరి 'బతుకమ్మ మునిగింది'నవల కూడా ఇక్కడ ప్రస్తావించాలి. వరంగల్ జిల్లాలోని మొగిలిచర్ల కాంచనపల్లి నరసింహదాసు 1750లోనే బతుకమ్మ చరిత్రను 33 పద్యాలలో రాశాడని చెప్పుకుంటారు. క్రీ.పూ. 1వ శతాబ్దం నాటి బౌద్ధ సాహిత్యంలోనూ, కళింగ జాతక కథల్లోనూ ఈ ప్రస్తావన ఉందని అంటుంటారు. బతుకమ్మ ఎన్నో ఏండ్లుగా జనాల బతుకుల్లో నిలబడటానికి, వారి వికాసానికి దోహదకారిగా మిగలడానికి కారణాలు మూడు అవి ఆడవాళ్ళు ఈ పూజ చేయటం, తీరొక్కపూలతో ఈ పూజలు జరగడం, సామూహికోత్సవంగా జరుపుకోవడం.

**పూలు:-** బతుకమ్మ పూలకొక ప్రాశస్త్యం ఉంది. ప్రతి పువ్వుకి వైద్యశాస్త్రంలో ఎంతో విలువైన వైద్య విలువలున్నాయి. ముఖ్యంగా గుమ్మడి పూవు కేంద్రంగా కేంద్ర భాగంలో నిలబెట్టడానికి స్త్రీ పురుష పునరుత్పత్తి అవయవాలను పోలిన గుమ్మడి పువ్వు ఉండడమే కారణంగా చెప్తారు. గుమ్మడిపువ్వు రంగు గౌరార్ణం. కాబట్టి బతుకమ్మ ఈ పువ్వును బట్టే గౌరమ్మ అయిందని చరిత్రకారులు చెప్తున్నారు. విష్ణువు రంగు నీలం కాబట్టి నీలం రంగున్న కట్లపూలు, బ్రహ్మ రంగు తెలుపు కాబట్టి గునుగుపూలు బతుకమ్మలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అడవిలో దొరికే పూలే కావడం, డబ్బులిచ్చి కొనాల్సిన అవసరం లేకపోవడం, ఇంటి చుట్టుపక్కల మన పరిసరాల్లో దొరికే పూలే అవడం వల్ల అందరూ ఎంతో ఉత్సాహంగా పూల సేకరణలో మునిగి ఉంటారు. పిరమిడ్ ఆకృతిలో బతుకమ్మను పేర్చడంలో తమ నైపుణ్యాన్ని చాటుకుంటారు. పూజించిన పూలను తొక్కకుండా ఉండటం కోసం పూర్వకాలంలో చెఱువు కట్టమీదనే ఆడుకుంటూ చెఱువుల్లో తెప్పలుగా పూలను వదిలేవారట. తమ పంటల దాహార్తిని తీర్చి తద్వారా తమ కడుపులకింత అన్నం పెట్టే చెఱువులకు కూడా కృతజ్ఞత చెప్పుకున్నట్లుగా భావించేవారు. తాము నీళ్లు తాగే చెఱువుల్ని ప్రక్షాళన చేసే ఈ పండుగ పట్ల ఎంతో ఆసక్తిని కనబరచేవారు.

**సామూహికోత్సవం:-** అప్పట్లో ఆడవాళ్ళందరూ కలుసుకోవడానికి ఒక కారణం కావాలనుకున్నారు పెద్దవాళ్ళు. అత్తవారింటికి పంపిన ఆడబిడ్డలు ఐదేళ్ళకొకసారి సారెకే కాకుండా, ప్రతి ఏడాదీ పుట్టింటికి రావాలని అదొక ఆచారంగా ఉండాలని ఆశించారు. ఆడవాళ్ళకి ఆరోగ్య అవగాహన, జీవితాలపట్ల సానుకూల దృక్పథం, కష్టంసుఖం పంచుకోవడానికి ఒక ఐక్యత వారి మధ్య ఉండాలని బతుకమ్మ పండుగను ఒక సమైక్యస్ఫూర్తికి నిదర్శనంగా మలిచారు.ఆకర్షణీయమైన పాటలు కూర్చి, ఆనందోత్సాహాలకోసం ఆటను చేర్చి అటు శారీరక వ్యాయామం, ఇటు మానసిక ఉల్లాసం ఉండేలా నవరాత్రులు మలిచారు. గోండులు ఆడే డియ్యానా ఆట, చెంచులు పాడే ఇయ్యాల పాటలు ఈ సామూహికోత్సవాలకి సజీవ ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా 2015లోనే ప్రకటించింది రాష్ట్ర ప్రభుత్వం. 2017లో సద్దుల బతుకమ్మ రోజున 10000 మంది మహిళలతో ఒకేసారి బతుకమ్మ ఆడి అరుదైన అద్భుతమైన గిన్నిస్ బుక్ రికార్డు సాధించింది తెలంగాణ.

ఆడవాళ్ళు:- ఆడవాళ్ళకు భర్త, పిల్లలే ప్రపంచం. తాము సౌభాగ్యంతో ఉండాలని, పిల్లలు ఆయురారోగ్యాలతో ఉండాలని తపిస్తూ చల్లటి బతుకునందించే గౌరమ్మ తల్లికి రకరకాల సద్దులు పెడుతూ గౌరీదేవిని 9 రోజులు 9 రకాలుగా పూజించుకుంటారు. పసుపులో పుట్టిన గౌరమ్మ బతుకమ్మగా తమ బతుకులు సల్లంగ చూస్తుందని విశ్వసిస్తారు.